

## బోరు బావిలో అదనపు పైపుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సదాశివనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 'గ్రామాల్లో మొదలైన నీటి సమస్య' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో గురువారం అధికార యంత్రాంగం స్పందించింది. అమర్లబండ బోరు బావిలో పైపులు తక్కువగా ఉండడంతో నీటి సమస్య ఏర్పడుతుందని పంచాయతీ కార్యదర్శి మరిన్ని పైపులను దించారు.



అదనపు పైపులను దించుతున్న సిబ్బంది

# జలగోస



గాంధారిలో అడుగంటిన బావి నీరు

కామారెడ్డి శివారులో ఎండిన వరి పంట

నిజాంసాగర్ ప్రాజెక్టులో తగ్గుముఖం పట్టిన నీటి సామర్థ్యం

- జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- జిల్లా సరాసరి నీటి మట్టం 15.02 మీటర్ల లోతులో జలం
- అత్యధికంగా వరి సాగు, పెరుగుతున్న ఎండలే కారణం
- ఎత్తిపోతున్న మోటార్ బోర్లు.. ఎండిపోతున్న నీటి బావులు
- అడుగంటుతున్న చెరువులు, ప్రాజెక్టులు
- పంటను కాపాడుకునేందుకు రైతుల నానా కష్టాలు

కామారెడ్డి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండడం ఆందోళనలకు గురి చేస్తోంది. ఒక నెలలో రెండు మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయి. గత ఫిబ్రవరి నెలలో జిల్లాలో భూగర్భ జలాలు 12.97 మీటర్ల లోతులోకి పడిపోయాయి. భూగర్భ జలాలు అడుగట్టుతుండడంతో మోటార్ బోర్లు ఎత్తిపోతుండగా నీటి బావులు ఎండిపోతున్నాయి. దీంతో బోరు బావుల కింద వేసిన పంట పొలాలు నీరు లేక బీటలు వారుతున్నాయి. జిల్లాలో మారుమూల గ్రామాలు తండాల్లో తాగు నీటి సమస్య ఎదురవుతోంది. రోజు రోజుకూ ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీరు తగ్గుముఖం పడుతోంది. అదే విధంగా జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగు చేయడంతో నీటి వాడకం అధికం కావడం వల్ల భూగర్భ జలాలు సైతం తగ్గుముఖం పట్టాయి. నెల వ్యవధిలోనే జిల్లాలో సరాసరిగా 2.5 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో అత్యధికంగా భూగర్భ జలాలు లోపలికి వెళ్లాయి. నీటి వాడకం ఇదే విధంగా కొనసాగితే ఏప్రిల్, మే నెలలో డేంజర్ జోన్‌లోకి పడిపోయే అవకాశం ఉంటుందని దీంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### జిల్లా సరాసరి నీటి మట్టం 15.02 మీటర్లలో..

ప్రస్తుతం జిల్లా సరాసరి 15.02 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. జనవరిలో 10.95 మీటర్ల లోతులోకి జలాలు ఉండగా, ఫిబ్రవరిలో 12.97 మీటర్ల లోతులోకి పడిపోయాయి. మార్చిలో 15.02 మీటర్ల లోకి పాతాల గంగా పడిపోయింది. ఈ లెక్కన నెల వ్యవధి లోనే 2.5 మీటర్ల అడుగుకు భూగర్భ జలాలు పడిపోయాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్‌లో అధిక మొత్తంలో భూగర్భ జలాలు పడిపోయినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### ఈ ప్రాంతాల్లో 20 మీటర్లకు పైగానే లోతులోకి జలాలు

మార్చి, ఏప్రిల్ నెలలలోనే ఎండలు మండిపోవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో పాటు భూగర్భ జలాలు అమాంతంగా పడిపోతున్నాయి. జిల్లా భూగర్భ జలాల సరాసరి నీటి మట్టం 15.02 మీటర్లలో ఉన్నాయి. అయితే పలు గ్రామాల్లో 20 మీటర్లకు పైగానే లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. కుర్తిలో 20.05 మీటర్లలోకి భూగర్భ జలాలు పడిపోగా అడ్లూర్‌లో 20.47, వెల్లనూర్‌లో 21.62, సర్వాపూర్‌లో 24.63, అన్నారంలో 24.68, సిద్దాపూర్‌లో 25.06, మోతెలో 25.12, బీబీపేటలో 25.38, అంచనూర్‌లో 27.62, బంజారతండాలో 27.75, గుర్గల్‌లో 35.23, కన్నాపూర్‌లో 35.53, గోద్మెగాంలో 37.03 మీటర్ల లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయి.


### అత్యధికంగా వరి సాగు, పెరుగుతున్న ఎండలే కారణం

జిల్లాలో ఈ యాసంగిలో లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి పంటను సాగు చేయడంతోనే భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నట్లు సంబంధితశాఖ అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు రోజు రోజుకూ ఎండలు ముదురుతుండడంతో పాతాల గంగ లోపలికి అమాంతంగా పడిపోతోంది. జిల్లాలో 2 లక్షల వరకు బోరు బావులు ఉన్నాయి. వీటి కింద యాసంగి సీజన్‌లో వరితో పాటు ఇతర పంటలను కూడా అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. దీంతో నీటి వినియోగం కూడా ఎక్కువగానే పెరిగింది. వరి పంటకు 1.2 హెక్టా మీటర్ల నీటి వినియోగం ఉంటే ఆరుతడి పంటలకు 0.6 హెక్టా మీటర్ల నీరు సరిపోతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగవటంతోనే భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు. పంటల సాగుకే కాకుండా ఇతరేతర అవసరాలకు నీటి వినియోగం పెరిగింది. ఎండలు పెరుగుతుండడంతో నీటి వాడకం మరింత పెరుగుతోంది. నీటిని ఇదే విధంగా వాడినట్లయితే మేలో భూగర్భ జలాలు మరింత లోతులోకి పడి పోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

### వట్టిపోతున్న బోర్లు, చెరువులు, కుంటలు

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగాయి. గత వారం రోజుల నుంచి జిల్లాలో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో భూగర్భ జలాలు తీవ్ర స్థాయిలో అడుగంటుతున్నాయి. కామారెడ్డి పట్టణంతో పాటు గాంధారి, దోమకొండ, బిక్కనూర్, తాడ్వాయి, లింగంపేట్ మండలాల్లో భూగర్భ జలాలు 18 మీటర్లలోతులోకి పడిపోయాయి. ఎల్లారెడ్డి డివిజన్‌లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. భూగర్భ జలాలు పడిపోతుండడంతో మోటార్ బోర్లు ఎత్తిపోతున్నాయి. రెండు ఇంచులు పోసే మోటార్ బోరు ప్రస్తుతం ఆఫ్ ఇంచ్‌లో పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల నీటి బావులు, చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. పంట పొలాల్లో మోటార్ బోర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలోని బోరు బావుల కింద వేసిన పంటల్లో నీరు లేక బీటలు వారుతు ఎండిపోతున్నాయి. వరి పంటను కాపాడుకునేందుకు వాటర్ ట్యాంక్‌ల ద్వారా పంటలకు రైతులు సాగు నీటిని అందిస్తూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

దోమకొండలో సన్నగా పోస్తున్న బోరు



ఎండిన వరి పంట

అడుగంటిన గాంధారి మొఖరం చెరువు

## ఫటా..ఫట్...

## 'రాజీవ్ యువ వికాస్'కు మంచి స్పందన

- ఇప్పటి వరకు 23వేల దరఖాస్తులు
- జిల్లాకు 10వేలకు పైగా యూనిట్లు
- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువ వికాస్ పథకానికి యువతి, యువకుల నుంచి మంచి స్పందన వస్తుందని ఇప్పటికే 23 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, రాజీవ్ యువ వికాస్ పథకం జిల్లా కన్వీనర్ సురేందర్ తెలిపారు. ఈ పథకానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 14 వరకు అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. మీసేవలో, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రభుత్వం ఆయా శాఖలకు యూనిట్ల లక్ష్యాలను నిర్ధేశించింది. జిల్లాలో సుమారు 10వేలకు పైగా యూనిట్ల లక్ష్యం ఉంది. రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు యూనిట్ల వ్యయం సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వనుంది. జిల్లాలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రాజీవ్‌యువ వికాస్, ఉపాధి హామీ పథకాల పలు అంశాలను వివరించారు.

**ఆంధ్రజ్యోతి:** రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎవరెవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

**అధికారి:** స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంతో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చు. మీసేవ కేంద్రాలతో పాటు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులను సమర్పించవచ్చు.

**ఆంధ్రజ్యోతి:** దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం?

**అధికారి:** రాజీవ్ యువవికాస్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.1లక్ష50 వేలు, పట్టణాల్లో రూ.2లక్షలలోపు ఆదాయం ఉన్నవారు రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ, ఆధార్, పాన్ కార్డు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాకు ఎన్ని యూనిట్లను కేటాయించారు?

**అధికారి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా రాజీవ్ యువ వికాస్ పథకానికి యూనిట్ల లక్ష్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. జిల్లాకు సుమారు 10 వేలకు పైగా యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. ఆయా శాఖల ద్వారా లక్ష్యాలకు అనుగుణంగా అర్హుల ఎంపిక ప్రక్రియ చేయడం జరుగుతోంది.

**ఆంధ్రజ్యోతి:** ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

**అధికారి:** రాజీవ్ యువ వికాస్ పథకానికి ప్రతిరోజూ 4 వేలకు పైగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 25 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది.

**ఆంధ్రజ్యోతి:** ఈ పథకం ద్వారా ఎంతమేర రుణాలు ఇవ్వనున్నారు?

**అధికారి:** రాజీవ్ యువవికాస్ పథకం ద్వారా రూ.50వేల నుంచి రూ.4 లక్షల విలువ గల యూనిట్లకు రుణ సహాయం అందించనున్నారు. జూలై 1 నాటికి 21 నుంచి 55 ఏళ్లు ఉన్న వారికి, వ్యవసాయ అనుబంధ రంగంలో 21 నుంచి 61 ఏళ్లు ఉన్న వారికి అర్హతలు కల్పించనున్నారు.

**ఆంధ్రజ్యోతి:** అర్హుల ఎంపిక ప్రక్రియ ఎలా చేపట్టనున్నారు?

**అధికారి:** ఈనెల 14 వరకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కానుంది. అనంతరం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఆయా శాఖల ద్వారా విచారణ చేపట్టి పరిశీలిస్తారు. పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. జూన్ 2 నుంచి లబ్ధిదారులకు యూనిట్లను కేటాయించనున్నారు. అర్హుల ఎంపికకు జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు.

● కామారెడ్డి, ఆంధ్రజ్యోతి

## ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

మాచారెడ్డి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలకవర్గ సభ్యులందరూ ఆలయ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరించేందుకు ముందుంటానన్నారు. గతంలో మంత్రిగా పని చేసినప్పుడు ఆలయ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టానన్నారు. ఇప్పుడు కూడా ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. భక్తుల సహాయంతోనే ఆలయ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలయ అభివృద్ధి పనులను చూసి చైర్మన్‌గా కమలాకర్‌రెడ్డికి చైర్మన్‌గా అవకాశం కల్పించానని తెలిపారు. చైర్మన్ కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తుల సహాయ సహకారాలతోనే ఆలయ అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. ఆలయ కమిటీ డైరెక్టర్‌లుగా యాదగిరిరెడ్డి, గొట్టగొని రామాగౌడ్, కొత్తకాపు రాజిరెడ్డి, పాత లక్ష్మీరాజం, బాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, అంజయ్య, రాజేష్‌కుమార్, నర్సింలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ పూజారి నరసింహాచారి సతీమణి రాసిన కవితా పుస్తకాలను షబ్బీర్‌అలీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నౌసిలాల్ నాయక్, పల్లె రమేష్‌గౌడ్, నారాయణ, రవి గౌడ్, మద్దెల రాజు, బాల్‌లింగం, నారాగౌడ్, నవీన్‌రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు వారం రోజుల్లోపు డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు: ధాన్యం విక్రయించిన రైతులకు వారం రోజుల్లోపు వారి ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు లేకపోయినా ధాన్యాన్ని విక్రయించిన రైతులకు డబ్బులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, విండో చైర్మన్ భూమయ్య, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాజారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ స్వామి, విండో ఉపాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చుక్కాపూర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



ముస్తాపూర్‌లో ఉపాధి పనుల్లో నిర్మించిన ఫిష్‌పాండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలికి పని కల్పించాలి
- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

లింగంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి రైస్‌మిల్లులు, అద్దె బస్సులను నడిపేందుకు కృషి చేస్తుందని ఆయన తెలియజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన రైతు అశోక్ ఉపాధి పనుల్లో ఫిష్‌పాండ్‌ను తవ్వుకోవడంతో ఫిష్‌పాండ్‌ను చూశారు. ఈ పనికి 1200 పని దినాలకు సుమారు రూ.3లక్షల కూలి చెల్లిస్తామని ఆయన తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని ఆయన ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న రేషన్‌కార్డుల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 149 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇళ్ల స్థలం ఉండి అర్హత కలిగిన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి మార్క్ అవుట్ ఇవ్వాలని ఆయన అధికారులకు తెలియజేశారు. సర్వేలో వస్తున్న సాంకేతిక సమస్యలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి లింగంపేటలో నాగన్న బావిని సందర్శించారు. గత సంవత్సరం సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు పర్యాటకుల సందర్శన రుసుము ద్వారా రూ.42వేలు, వీడియో రుసుము కింద రూ.10,900 వసూలు చేసినట్లు ఆయన తెలియ జేశారు. సందర్శకులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నందున శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సురేందర్, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున్, మేనేజర్ రాజేందర్, ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ సురేష్, ఏపీఎం శ్రీనివాస్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

### మహిళా సంఘాల ఆధ్వర్యంలో

## 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్**



బంజారా తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సురేందర్

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌కు గాను రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించినందుకు జిల్లాలో ఐకేపీ గ్రామ సంఘాల మహిళల ఆధ్వర్యంలో 183 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ తెలిపారు. మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళలకు కేటాయించగా, ఆయన గురువారం మండలంలో గ్రామ సంఘాల మహిళలకు కేటాయించిన పోచారం, మాల్తుమ్మెద, వదల్పర్తి, బంజారా, ధర్మారెడ్డి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది వరకు జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం జిల్లాలో గ్రామ సంఘాల మహిళల ఆధ్వర్యంలో 163 గ్రామాల్లో 183 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు, వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. జిల్లాలో పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. జిల్లాలో మహిళల ఆధ్వర్యంలో 183 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 10లక్షల 64 వేల 600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసే లక్ష్యం ఉందన్నారు. ధాన్యం సేకరణలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం మరింతగా పెంచిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు మరింత బలోపేతం కానున్నాయని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందనున్నారని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా సమర్థవంతంగా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు, రైతులకు తాగునీరు, ఓ ఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రైస్‌మిల్‌కు చేరాక 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఏపీవో జగదీష్ కుమార్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామ్‌గౌడ్, నగేష్, ఏపీవో సాయిలు, ఐకేపీ సీసీలు, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుండీల ఏర్పాటు


నీటి కుండీలు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భీమ్‌గల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రధాన వీధులలో జంతువుల దాహార్తి తీర్చేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో నీటి కుండీలను ఏర్పాటు చేశారు. సీడీఎంఏ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేసవికాలం దృష్ట్యా పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి కుండీలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. కుండీలను ప్రతినిత్యం నీటిలో నింపడం జరుగుతుందని ప్రజలు కూడా దీనిని గమనించి వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారం


మోస్రాలో బోరు వేస్తున్న దృశ్యం

మోస్రా,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలకేంద్రంలోని హనుమాన్ మందిరం కాలనీలో నీటి సమస్యను పరిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ బాధ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి దృష్టికి నాయకులు, మోస్రా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తీసుకెళ్లగా ఆయన స్పందించారు. మాజీ ఎంపీటీసీ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్‌తో చెప్పి వెంటనే నీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేయమని తెలిపారు. గురువారం కాలనీలో బోరు వేశారని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారం చేసినందుకు గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, కార్యకర్తల తరపున యలమంచిలి శ్రీనివాస్, ఏనుగు రవీందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం


సుద్దులంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని సుద్దులం, రుద్రూరు మండలంలోని బొప్పాపూర్, అక్బర్‌నగర్ గ్రామాలలో గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహత్మ గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలతో పాదయాత్ర చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం సుద్దులం గ్రామంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. అక్బర్‌నగర్ గ్రామంలో సన్నబియ్యంతో చేసిన వంటను లబ్ధిదారుడి ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, కాంగ్రెస్ నాయకులు షాహీద్, చంద్రశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలి

మోర్తాడ్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీ నర్సింగ్ టీచర్ ఖాళీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి ఆర్.స్వప్న కోరారు. విద్యార్థులకు నాలుగు నెలలు నర్సింగ్ పాఠాలు బోధించేందుకు పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. వేతనం నెలకు రూ. 23 వేలు, అర్హతలు బీఎస్ నర్సింగ్ చదివిన మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులు మోర్తాడ్ కేజీబీవీలో మే 5వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

కోటగిరి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలోని చెరువులో పోశెట్టి(48)అనే వ్యక్తి ప్రమాదవశాతు కాలుజారి మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. పోశెట్టి బుధవారం ఇంట్లో నుంచి పొలానికి వెళ్లాడు. చెరువులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందాడు. మృతదేహం గురువారం బయట పడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని చెరువుల్లోంచి వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నవీపేట,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తడగామ కాలనీకి చెందిన తోకల గంగారాం అనే వ్యక్తిని ఈ నెల 9న బైక్ ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై వినయ్ తెలిపారు. స్థానిక శివాజీ చౌక్ సమీపంలో ఉదయం నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన బైక్ ఢీకొనడంతో తోకల గంగాధర్ తలకు తీవ్ర గాయాలయ్యాయని వెంటనే అతనిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కోటగిరి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా లక్ష్మణ్,నాగేష్ అనేవ్యక్తులు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. రుద్రూరు గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రూ.500 జరిమానతో పాటు రెండు రోజుల జైలుశిక్ష, రాయకూర్ గ్రామానికి చెందిన నాగేష్‌కు వెయ్యి రూపాయల జరిమానతో పాటు ఒకరోజు జైలుశిక్ష బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి విధించినట్లు రుద్రూరు ఎస్ఐ తెలిపారు.

### రెంజల్‌లో..

రెంజల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సాటాపూర్ ఎక్స్‌రోడ్డులోబుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా సాటాపూర్ గ్రామానికి చెందిన అఫ్రోజ్, మహరాష్ట్రకు చెందిన బాలాజీలు మద్యం తాగి వాహనాలు నడపడంతో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేయగా గురువారం బోధన్ కోర్టులో హజరుపర్చగా సెకండ్ క్లాస్ జడ్జి శేషతల్ప సాయి ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్షతో పాటు 2500రూపాయల జరిమాన విధించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్తారని ఎస్ఐ పేర్కొన్నారు.

# ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక రైతు వేదిక వద్ద ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతలు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అధికారులు, నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, వినోద, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, ఏపీఎం భూమేష్ గౌడ్, ఏఈవోలు మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**సిరికొండ:** జంగిలోడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల రాంచంద్రపల్లి తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రావుట్ల మాజీ ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రన్న మాట్లాడుతూ భౌగోళికంగా రాంచంద్రపల్లికి వెళ్లాంటే భీమ్‌గల్ మండలం గంగారాయి నుంచి వెళ్లాల్సి ఉందన్నారు.. రావుట్ల నుంచి అక్కడికి నేరుగా వెళ్లడానికి దారి లేదు అడవిలో నుంచి కాలిబాటన వెళ్లాల్సి పరిస్థితి ఉన్నందున అక్కడ ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కోరిన వెంటనే మంజూరు ఇప్పించారని ఎర్రన్న చెప్పారు. ఇక్కడ ఉండే గిరిజన రైతులు నేటి నుండే ధాన్యాన్ని తూకం వేయించుకోవాలని ఎర్రన్న కోరారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ లావణ్య,క్రాంతికుమార్,మాలవత్‌రెడ్డి,మాలవత్ రాజు,గంగాధర్,భూక్య రాజు, మాలవత్ భూమేశ్వర్ తండాకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

**మోర్తాడ్:**మండలంలోని దోన్‌పాల్ గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. వరికొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, తాజా మాజీ సర్పంచ్ పర్స దేవన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, రాజన్న, శేఖర్, ఐకేపీ సీసీలు శ్రీనివాస్, రాజేశ్వర్, మహేందర్, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


దోన్‌పాల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

**మోస్రా:** చందూర్ మండలంలోని లక్ష్మాపూర్, కారేగావ్, మేడిపల్లి తండా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్న కేంద్రాలను చందూర్ తహసీల్దార్ శాంత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మహిళ మండలి కార్యాలయం సిబ్బంది, సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ఆలూర్:**ఆలూర్ మండలంలోని దేగాం గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఏవో రాంబాబు, ఎంఆర్‌వో రమేష్, లింగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఏపీఎం గంగారాం, మహిళ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ ర్యాలీని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

● సీపీ సాయిచైతన్య


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలో నిర్వహించే ర్యాలీని ప్రతిఒక్కరూ ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీపీ సాయిచైతన్య కోరారు. గురువారం కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో హనుమాన్ ర్యాలీ నిర్వాహకులతో పాటు వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పాటించాల్సిన నియమనిబంధనలు, చేయవల్సినవి, చేయకూడనివి వివరించారు. ప్రతి ఒక్కరు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవం జరుపుకోవాలని ర్యాలీ ఆధ్యాత్మికంగా నిర్వహించుకోవాలని అదే సమయంలో ఇతరులకు, సామాన్యులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డ్రోన్‌లను నిషేధించడం జరిగిందన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఆర్యసమాజ్, ఏబీవీపీ, హిందూవాహిని ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలను, అభిప్రాయాలను తెలియజేశారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సాయికిరణ్, అదనపు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి అదనపు డీసీపీ మస్తాన్ అలీ, ఏసీపీ రాజావెంకటరెడ్డి, ఇన్స్‌పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. 12న ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర వల్ల ట్రాఫిక్‌ను మళ్లించినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కోటగిరి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలైనట్లు కోటగిరి ఎస్ఐ సందీప్ తెలిపారు. పోతంగల్ గ్రామానికి చెందిన నేరోళ్ల కిరణ్, అనిల్ అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై హంగర్గ గ్రామానికి వెళ్తున్నారు. ఎదురుగా కుక్కను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిరణ్(24)తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు అనిల్‌కు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## 'బ్యాంక్ సేవలను వినియోగించుకోవాలి'

రెంజల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని నవీపేట కో-ఆపరేటీవ్ బ్యాంక్ మేనేజర్ గౌసోద్దీన్ అన్నారు. గురువారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో రైతులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రోహిత్ రావ్, రామాలయం చైర్మన్ గౌసుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, సోసైటీ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సాయరెడ్డి, ప్రసాద్, మోహన్, చరణ్ రెడ్డి, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ముప్కాల్ గ్రామంలో గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని భీమ్‌గల్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కానిస్టేబుల్‌పై దాడిచేసిన ద్విచక్రవాహనదారుడు

భిక్కనూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వాహనతనిఖీలలో భాగంగా వాహనాన్ని ఆపిన కానిస్టేబుల్‌పై ద్విచక్రవాహనదారుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెల్మెట్‌తో దాడిచేసిన సంఘటన భిక్కనూరు మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం టోల్‌ప్లాజా వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కామారెడ్డి వైపు నుంచి వెళ్తున్న ద్విచక్రవాహనానికి నంబర్ లేకపోవడంతో పోలీసులు దానిని ఆపే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్ర హించిన సదరు ద్విచక్రవాహనదారుడు తన బైక్‌నే ఆపు తావా అంటూ కానిస్టేబుల్‌పై హెల్మెట్‌తో దాడిచేశాడు. అక్కడే ఉన్న మరో సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకుని ముందుకు వెళ్లాడు. ఇది గమనించిన వాహనదారులు అతని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బోన్ల నర్సింలు (35) గురువారం భార్యాపిల్లలు బంధువుల వివాహ వేడుకలకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యాపిల్లలు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో దూలానికి వేలాడుతున్నాడు. భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## పాక్సోకేసులో ఒకరికి జైలు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడిచేసిన నేరస్తుడ షేక్‌షాదుల్ అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల కఠినకారగార శిక్ష, రూ.2 వేల జరిమానాను న్యాయాధికారి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ విధించారని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. నిజాంసాగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల మైనర్ 2021 జనవరి 16న ఇంటి బయట ఆడుకుంటుండగా చిన్నారిపై నిజాంసాగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన షాదుల్ లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలు పడంతో పోలీసుస్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టడంతో పాటు సాక్షులను విచారించి కోర్టులో సమర్పించడంతో న్యాయాధికారి నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారని తెలిపారు.

## పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ భక్తులు

సిరికొండ ఎప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హన్మాన్ మాలధారులు హన్మాన్ జయంతి రోజుల దీక్షలు విరమించడానికి పాదయాత్రచేస్తూ కొండ గట్టుకు గురువారం సాయంత్రం బయలు దేరారు. సిరికొండ మండలం రావుట్ల గ్రామానికి చెందిన హన్మాన్‌మాల ధరించిన భక్తులు ఇరుముడి లతో కొండకు గట్టుకు పాదయాత్రగా బయలు దేరారు. ఈ నెల 12న జరిగే హన్మాన్ జయంతి రోజున దీక్షలు విరమించనున్నారు. సిరికొండకు చెందిన భక్తులు సంతోష్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తూ కొండగట్టుకు బయలు దేరారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ డివిజన్ ఇంజనీర్ అల్లాపూర్ రమేష్ అన్నారు. గురువారం బోధన్ సబ్ స్టేషన్ కార్యాలయ ప్రాంగణంలో టెక్నికల్, సెఫ్టీ అధికారి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో లైన్ క్లియర్ ద్వారా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ పనులు చేసే ప్రదేశంలో, సబ్ స్టేషన్‌ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఈ ముక్త్యార్ హైమద్, ఎస్.నాగేష్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, ఏఈలు నాయిని కృష్ణ, కళ్యాణ్, మక్దూమ్ అలీ, మారుతీ, కిషోర్, శ్రీనివాస్, బుజ్జి బాబు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమితండా గ్రామానికి చెందిన గూగులోత్ హనుమా రోడ్డుప్రమాదంలో మృతిచెందగా అతని కుటుంబానికి బీఆర్ఎస్ తరపున రూ.2లక్షల గురువారం చెక్కును మండల అధ్యక్షుడు సత్యనారాయణ అందించారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, పోతాగౌడ్, మాజీసర్పంచ్ చందర్ పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

వేల్పూర్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలో గురువారం ప్రియాంక అనే వివాహిత ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు (25) పాల్పడినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎత్తిన నడ్పి సాయన్న కూతురు ప్రియాంకను మోతె గ్రామానికి చెందిన కండ్ల భాస్కర్‌తో గత నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వీరికి మూడు సంవత్సరాల బాబు ఉన్నాడు. కుమారుడు జన్మించిన తర్వాత ఆమె భర్త భాస్కర్, మామ నడ్పి కాశన్న, అత్త గంగమల్లు కలిసి ఇంట్లో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ప్రియాంక ఆమె అత్త, మామ, భర్త వేధించడం వల్ల మన స్తాపానికి గురై ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉన్న దూలానికి తన చున్నితో ఉరివేసుకొని చనిపోయింది. మృతురాలి తండ్రి నడ్పి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

## కల్తీకల్లు నియంత్రణకు చర్యలు


బాధితులను పరామర్శిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10: కల్తీకల్లు నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి తెలిపారు. గురువారం జీజీహెచ్ ఆసుపత్రిలో కల్తీకల్లు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 92 మంది బాధితులు కల్తీకల్లు బారిన పడగా అందులో 67 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. మొత్తం 27 మందిపై కేసులు నమోదుచేయగా నలుగురుని అరెస్ట్ చేసి 23 మంది పరారీలో ఉన్నారన్నారు. ఇప్పటికే ముందస్తు చర్యల్లో భాగంగా 1125 లీటర్ల కల్లును పారాబోశామని, 50 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నట్లు తెలిపారు. బాధితులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని వైద్యులను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు డిపోపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

ఎడపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కల్లు డిపోపై గురువారం నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆధ్వర్యంలో దాడులు చేశారు. దాడుల సమయంలో డిపోలో ఉన్న 350 లీటర్ల కల్తీ కల్లును ధ్వంసం చేసి కల్తీ కల్లు తయారు చేస్తున్న అమర శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీకల్లు ఎవరు తయారు చేసినా వారిపై చట్టరిత్యా చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. దాడిలో ఆమె వెంట హెడ్ కానిస్టేబుల్ రాజన్న, కానిస్టేబుళ్లు హమీద్, ఉత్తం, శ్యాం, ఆశన్న తదితరులు ఉన్నారు.

## సిరికొండ జేఎల్‌ఎం మృతి

సిరికొండ ఎప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరికొండలో జెఎల్ఎంగా పనిచేస్తున్న అన్వేష్(30) తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని మరణించాడు. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన అన్వేష్ జూనియర్ లైన్‌మెన్‌గా సిరికొండకు 2022లో బదిలీపై వచ్చారు. గురువారం మధ్యాహ్నం రెండున్నర, మూడు గంటల సమయంలోతాటిపల్లిలోని తన స్వగృహంలో ఉరివేసుకుని చనిపోయాడు. కారణాలు తెలియలేదని ఎస్సై ఎల్.రామ్ చెప్పారు. అన్వేస్‌కు వివాహం కాలేదు. విధుల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనిచేసే వాడని సిరికొండ గ్రామస్తులు చెప్పారు. అన్వేష్ తండ్రి మదన్‌లాల్ 2001లో తాటిపల్లి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్కాల్ గ్రామానికి చెందిన గున్నాల శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం కాంగ్రెస్ పార్టీ గ్రామ ఇన్‌చార్జి శేఖర్ అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొర్రన్న, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

## వ్యవసాయ భూములకు దారి ఇవ్వాలని వినతి

గాంధారి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 70 సంవత్సరాల నుంచి వ్యవసాయ భూములకు ఉన్నదారిని ప్రస్తుతం కొందరు మూసివేస్తున్నారని రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గాంధారి మండల కేంద్రంలో వ్యవసాయ భూములకు ఉన్న బండ్లబాట, ట్రాక్టర్‌దారులను రాధస్వామి సత్సంగ్ వారు మూసివేసేందుకు గోడకడుతున్నారని తెలిపారు. గతంలో గోడ కట్టి పక్కనుం చి వాడుకోవాలని తెలిపి ఇప్పుడు ఆ భూమిని సైతం కొనుగోలు చేసి గోడ నిర్మిస్తున్నారని తెలిపారు. దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తు న్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరామని రైతులు తెలిపారు. కార్య క్రమంలో ప్రసాద్, రాములు,బాలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## బడీడు పిల్లలు బడుల్లో ఉండాలి



సంగెంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు ప్రభుత్వ బడులలో చదువుకోవాలని, ఇతర పనులకు వెళ్లవద్దని నాయకులు శంకర్ అన్నారు. గురువారం బోధన్ మండలంలోని సంగెం గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో సృజనాత్మకత పెంపొందించేలా విద్య కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూతన సాంకేతికను వినియోగిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపించకుండా తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, విజయ, వెంకట లక్ష్మి, స్రవంతి, సంధ్య, వసుంధర, సుజాత, సుదర్శన్, గ్రామ పెద్దలు నరేందర్, ఈశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు స్థల పరిశీలన


రాంగంగానగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోటగిరి,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నియోజకవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు గురువారం సంబంధిత శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. పోతంగల్ మండలంలోని రాంగంగానగర్ గ్రామంలో 40, 41 సర్వే నెంబర్‌లలో 15ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. తెలంగాణ ఎడ్యూకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి డీఈ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో స్థల సర్వేను చేపట్టారు. పాఠశాల నిర్మాణానికి సుమారు 20ఎకరాల స్థలం అవసరం కాగా 15ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ప్రభుత్వ స్థలం ఉన్నందున పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని డీఈ వెల్లడించారు. ఆయన వెంట పోతంగల్ తహసీల్దార్ గంగాధర్, ఏఈ నాగేశ్వర్ రావు, సర్వేయర్ పోశెట్టి తదితరులున్నారు.

## రేషన్‌డీలర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

లింగంపేట, ఎప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోమటిపల్లి గ్రామ రేషన్‌డీలర్ రాజులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నాడని గ్రామానికి చెందిన గంపల నవీన్ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఇతర అధికా రులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆయన తెలియజేశారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన

మద్నూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలంలో ధోతి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీశ్రీ మల్లికార్జున స్వామి ఖాత్గావ్ పాల్గొని భక్తులకు హితబోధ చేశారు. ప్రతి గ్రామంలో ఆలయాలు సంస్కృతి సంప్రదాయానికి ప్రతీకరు.

## ఎల్లారెడ్డి ఎంఈవో రాజులుకు సన్మానం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన రాజులును గురువారం మండల విద్యాధికారి కార్యాలయంలో ప్రైవేట్ పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, అనిల్‌కుమార్, శంకర్, నాగభూషణం పాల్గొన్నారు.

## హాజీపూర్ తండాలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హాజీపూర్ తండా గ్రామంలో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ గురువారం నాలుగోరోజుకు చేరింది. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌కు ఇంగ్లీష్, కంప్యూటర్ సైన్స్ ఉపయోగాలను కళాశాలకు చెందిన అధ్యాపకులు సంగీత, స్వప్నలు వివ రించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

## మినార్‌పల్లి సహకార సంఘం రైతులకు అవగాహన

బోధన్‌రూరల్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు అందించే సౌకర్యాలపై బోధన్ మండలం మినార్‌పల్లి సహకార సంఘంలో సంఘ అధ్యక్షులు రవీందర్ బాబు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు అందించే సౌకర్యాలపై అవగాహన కల్పించారు. సహకార సంఘాల బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తీగజాతి కూరగాయలను సాగు చేయాలి

నవీపేట,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): రైతులు తీగజాతి కూరగాయలను సాగు చేయాలని, తీగజాతి కూరగాయలను సాగు చేసిన రైతులకు 50శాతం సబ్సిడీ అందించడం జరుగుతుందని జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం నవీపేటలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, ఉద్యాన వన శాఖ అధికారి వహీద్, ఏపీఎం భూమేష్ గౌడ్, ఏఈవోలు పాల్గొన్నారు.

## దేగాం గ్రామానికి రాష్ట్రస్థాయి పురస్కారం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): సుస్థిర గ్రామాభివృద్ధికి అన్ని అంశాలలో అత్యుత్తమ ప్రదర్శన కలిగి ఉండడంతో దేగాం గ్రామానికి రాష్ట్ర స్థాయి పురస్కారం అందించిందని ఎంపీడీవో గంగాధర్ అన్నా రు. గురువారం రాష్ట్రస్థాయి అ వార్డును పొందిన దేగాం పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, మహిళ సాధికారత, హరితహారం తదితర అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. కార్యక్రమంలో ఆలూర్ పంచాయితీ కార్యదర్శి రాజలింగం, కిషోర్, నవీన్, నసీర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీలాలో మహిళ అదృశ్యం

రెంజల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామానికి చెందిన మహేక్ సుల్తానా 22 అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నీలా గ్రామానికి చెందిన మహేక్ సుల్తానా సాటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో మూడు నెలల క్రితం పెళ్లి జరిగిందని, ఇంట్లో చిన్న గొడవ కారణంగా నీలా గ్రామం తల్లి గారికి ఇంటికి వచ్చిన మహేక్ సుల్తానా ఈ నెల 8న ఫ్రెండ్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ఇళ్లలో బంధువుల ఇళ్లలో ఆచూకీ వెతకగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

## నాళేశ్వర్‌లో బైక్ చోరీ

నవీపేట,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని అడెపు నర్సయ్యకు చెందిన హోండా షైన్ బైక్ ఈ నెల 7న చోరీకి గురైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. తన ఇంటి ఎదుట బైక్‌ను నిలిపి ఉంచగా అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు బైక్‌ను ఎత్తుకెళ్లారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

రెంజల్,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఫేటా.. ఫేట్...

## ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి

● సతీష్‌రెడ్డి, తహసీల్దార్, రాజంపేట



రాజంపేట మండలంలో రెవెన్యూశాఖ ద్వారా అందుతున్న సేవలు, అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో, వాల్టా చట్టం అమలు, ఆధార్ సెంటర్‌ల నిర్వహణ తీరు, భూరికార్డుల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు తీసుకుంటున్న చర్యలపై గురువారం తహసీల్ధార్ సతీష్‌రెడ్డి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

**ఆంధ్రజ్యోతి:** మండలంలోని గ్రామాలల్లో అక్రమ ఇసుక రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**తహసీల్దార్:** గ్రామాలలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే రెవెన్యూ యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ ఇసుక తరలిస్తే ఎవరైన సరే ఉపేక్షించేది లేదు.

**ఆంధ్రజ్యోతి:** గ్రామాలలో రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు?

**తహసీల్దార్:** గిర్ధావర్, రెవెన్యూ సిబ్బందితో ఆకస్మిక తనిఖీ చేయించి రేషన్‌బియ్యం పక్కదారి పట్టించే ప్రయత్నంచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడు కృషి చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** భూరికార్డుల సమస్యల పరిష్కారంకోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

**తహసీల్దార్:** మండలంలో ఎవరికైన భూమికి సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా తహసీల్ధార్ కార్యాలయానికి వచ్చి తెలియజేయాలి. వారి పరిధిలో చేయదగిన సమస్యలకు పరిష్కారం చేయబడుతాయి

**ఆంధ్రజ్యోతి:** వాల్టా చట్టం పరిరక్షణ కోసం మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు...?

**తహసీల్దార్:** వాల్టాచట్టం పరిధి దాటి ఎవరైన అక్రమ కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం.

**ఆంధ్రజ్యోతి:** మండల స్థాయిలో ఆధార్ సెంటర్ లేకపోవడంవల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికిఉన్నతాధికారులకు నివేదించారా

**తహసీల్దార్:** మండల స్థాయిలో ఆధార్ సెంటర్ విషయమై ఉన్న తాధికారులకు నివేదిక పంపించి త్వరలోనే సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తాం.

● (ఆంధ్రజ్యోతి, రాజంపేట)

# దాహం తీరేదెలా..!?

● రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత ● నిరుపయోగంగా నీటి తొట్టీలు ● మూగ జీవాలకు తప్పని ఇబ్బందులు



అన్నాసాగర్ గ్రామంలో నీరు లేకుండా ఖాళీగా ఉన్న పశువుల తొట్టి



రంగు మారిన నీరు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు ఎండలు మండి పోతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో అడవి ప్రాంతాల్లోని వాగులు కుంటలు చెరువులలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో మూగజీవాలు దాహర్తిని తీర్చడం కోసం ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్టిలను ఏర్పాటు చేసింది. అందులో నీళ్లను ట్యాంకుల నల్లాల ద్వారా నీటిని నింపాలి. కానీ కొన్ని గ్రామాలలో ఎక్కడికక్కడే నీటితో చెత్తాచెదారంతో వృధాగా దర్శనమిస్తున్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని చాలా గ్రామాలలో ఎటు చూసినా పశువుల కోసం నిర్మించిన నీటితో నీరు లేక పోవడంతో పశువులు దాహం కోసం అలమటిస్తు న్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో పశువుల కోసం కొన్ని వేలు ఖర్చు చేస్తూ నీటితో నిర్మిస్తే నీరు లేక వృధాగా మారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా నీటి తొట్టిల నిర్మాణం తూతూ మంత్రంగా నిర్మించారు అవసరం ఉన్నచోట కాకుండా అనవసరం ఉన్నచోట నీటితో నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. అయితే సంబంధిత గ్రామ పంచాయతీ సిబ్బంది పశువుల తొట్టీలను పట్టించుకోక నీటిని నింపకపోవడంతో వేసవికాలంలో పశువులు నీటి కోసం కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి తోటిలకు మరమ్మత్తులు చేసి పశువుల పట్టీలలో నీటిని నింపి మూగజీవాల దాహన్ని తీర్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# జాడలేని ఫాగింగ్

● ఎల్లారెడ్డి పట్టణంలో దోమల స్వైర విహారం
● విష జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ఫాగింగ్ జాడలేదు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కొట్టి చంపుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలతో పాటు పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన వార్డులలో దోమల నివారణకు చర్యలు లేవని స్థానిక ప్రజలు చెబుతున్నారు. చాలా రోజుల నుంచి ఫాగింగ్ మాటే లేదు, చీకటి పడితే కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు, వీటిని అదుపు చేయకపోవడంతో మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలు వెంటాడు తున్నాయని బాధితులు వాపోతున్నారు. మురికి కాలువలలో చెత్తా చెదారం నిండి మురికి నీరు మురికి నీరు నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అదే విధంగా ఖాళీ ప్రదేశాలలో పిచ్చి మొక్కలు శుభ్రత లేకపోవడం చెత్తా చెదారంతో పారిశుధ్యం అస్త వ్యస్తంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణ కేంద్రంతో పాటు విలీనమైన ప్రాంతాలలో మురికి కాల్వలు శుభ్రం చేసి, ఫాగింగ్ కొట్టి ప్రజలను విష జ్వరాల భారీ నుంచి కా పాడాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురికి

# వైభవంగా పార్వతీ రాజరాజేశ్వర స్వామి కల్యాణ వేడుకలు

● భక్తులతో దద్దరిల్లిన పార్వతి రాజరాజేశ్వరి స్వామి ఆలయం

రామారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలోని పార్వతి రాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం పార్వతి రాజరాజేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు నేమిలి రాధాకృష్ణ శర్మ, వెంకట రాజయ్య శర్మ, నేమలి నాగ రాజ శర్మ, మనీష్ శర్మ, అభిలాష్ శర్మల మంత్రోశ్చరణ నేపథ్యంలో ఆలయంలో శ్రీ పా ర్వతి రాజరాజేశ్వర స్వామి విగ్రహాలకు పాలాభిషేకం సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయం నుంచి రథాల గ్రైన్ చౌరస్తా వరకు విగ్రహాలను తీసుకెళ్లి ఊరేగింపుతో రోడ్డుపై నీరు పోస్తూ ఆలయానికి తరలించారు. అనంతరం పంతుళ్ల ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ దేవత దేవీల కల్యాణ మహోత్సవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ వేడుకల్లో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామారెడ్డి ఎస్సై నరేష్ నేతృతంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ రంగు రవీందర్ గౌడ్, ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, ప్రతినిధులు శంకర్ గౌడ్, కుశన్నోల్ల రమేష్, ల్యాగల మహిపాల్, గంగాధర్ చారి, గంగాధర్, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

**వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు నిమ్మరసం పంపిణీ**

కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రథాల రామారెడ్డి మండల కేంద్రంలో పార్వతీ రాజరాజేశ్వర స్వామి కల్యాణోత్సవం పురస్కరించుకొని గురువారం వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు నిమ్మరసం పంచడం నిర్వహించారు. కామారెడ్డి జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఎండాకాలం నేపథ్యంలో నిమ్మరసం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ట్రస్టు ప్రతినిధులు, రాజకీయ నాయకులు కడెం శ్రీకాంత్, పడిగేల శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాస్, బండి ప్రవీణ్, నాగ రాజు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పార్వతి రాజరాజేశ్వరి స్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు



స్వామి విగ్రహాలను ఆలయానికి ఊరేగింపుతో తీసుకొస్తున్న భక్తులు

# వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

● క్షణం కరెంటు పోకుండా సమ్మర్ ప్లాన్: నారాయణ

లింగంపేట, ఎప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలను అందిస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-2)ఉమ్మడి నిజామాబాద్ జిల్లా చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విద్యు త్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయి వినియోగదారులనుంచి పిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షణం కరెంటు పోకుండా సమ్మర్ ప్లాన్ తయారు చేసినట్లు ఆయన తెలియజేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది 24గంటలు పనిచేస్తున్నారని ఆయన తెలియజేశారు. వినియోగదారుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం అన్ని మండల కేంద్రాలలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా పిర్యాదు స్వీకరించి పరిష్కరిస్తున్నామని సమస్యలు పరిష్కారం కాకపోతే నిజామాబాద్‌లో పిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సిబ్బంది లూజ్ లైన్‌లను సరిచేయాలని ఆదే శించారు. సబ్‌స్టేషన్‌లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను అందుబాటులో ఉంచుకోవాలని ఆయ న తెలియజేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని విద్యుత్ సిబ్బందికి సూచించారు. రైతులు వ్యవసాయ మోటర్లకు కేపాసిటర్లు బిగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ వినియోగదారుడు కరెంట్ బిల్లును చెల్లించి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సభ్యుడు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, శ్రావన్‌కుమార్, డీఈఈ విజయ సారథి, ఏడీఏ మల్లేష్‌ఏఈఈ సాయినాథ్, హరీష్‌రావు, లక్ష్మయ్య, లింగంపేట, గాంధారి, సర్వాపూర్, శెట్పల్లి సంగారెడ్డి, విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.



లింగంపేటలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ ఉమ్మడి నిజామాబాద్ చైర్మన్

# మున్సిపల్ కార్మికుల హాజరు శాతం పక్కాగా నమోదు చేయాలి

● హాజరు పట్టికను పరిశీలించిన కమిషనర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల హాజరుశాతం పక్కాగా నమోదు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పలు జోన్‌లలో గురువారం ఉదయం 5 గంటలకు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. డ్రైనేజీ తొలగింపు తీరును పరిశీలించారు. అంతేకాకుండా కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు డుమ్మా కొట్టకుండా చూసుకోవాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా కార్మికులకు ఎండదెబ్బ తగలకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రైవర్లు సైతం అతివేంతో వాహనాలను నడపరాదని మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్మికులు పనివేళల్లో సకాలంలో వచ్చి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహిపాల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ దిలీప్‌కుమార్

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి

నవీపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నవీపేట, ఫత్తేనగర్, రాంపూర్, ఎలికే ఫారంలలో జరిగిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపర్చడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, క్వింటాలు ధాన్యానికి 500రూపాయల చొప్పున బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ షాపుల లో సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మహత్మ గాంధీ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. తడ గామ చెరువు వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, సంజీవ రెడ్డి, చల్లా రవీందర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవీపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## ఎన్ఎస్ఎస్ శిబిరాలతో స్నేహభావం

● టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి



వలంటీర్లకు సర్టిఫికేట్ అందజేస్తున్న రిజిస్ట్రార్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో ఒక వైపు విద్యాభ్యాసం చేస్తూ మరో వైపు ఎన్ఎస్ఎస్ యూనిట్ల ద్వారా గ్రామాల్లో విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరి అన్నారు. గురువారం వర్సిటీ యూనిట్-1,4 ఆధ్వర్యంలో సుద్దపల్లిలో నిర్వహిస్తున్న వారం రోజుల క్యాంపు దిగ్విజయం చేయడంతో ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్వప్నను రిజిస్ట్రార్ అభినందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా దృక్పథం కలిగి ఉండలన్నారు. విద్యార్థులు గ్రామాల్లో జరిపిన సర్వే వివరాలకు పరిష్కారం కనుగొని ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయలన్నారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులలో స్నేహభావం, సమగ్రత ఏర్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ గ్రామ ప్రజలను చైతన్య పరిచి మూడ నమ్మకాల పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సహజ వనరులను రక్షించాలన్నారు. వలంటీర్లు వారం రోజులు నిర్వహించిన కార్యక్రమాలు ప్రోగ్రాం ఆఫీసర్లు సమీక్షించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వలంటీర్లుకు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ యోహాన్, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, సూపరిడెంట్ నివేదిక, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

## డిగ్రీ, పీజీ విద్యార్థులకు అపార్ తప్పనిసరి



టీయూలో సమావేశంలో పాల్గొన్న పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు మాట్లాడుతున్న రిజిస్ట్రార్

డిచ్‌పల్లిఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ నంబర్ (అపార్ ఐడీ) ఉండాలని రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. గురువారం వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెంబరు భవిష్యత్తులో విద్యార్థులకు, కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి పొందినప్పుడు విద్యార్హత కోసం ఉపయోగపడుతుందన్నారు. విదేశీ విద్యా అభ్యసనకు ప్రధానంగా ఉపయోగపడుతుందన్నారు. అన్ని కళాశాలలో ఈ ప్రక్రియ వేగవంతం చేసి ఈ నెల 19 లోపు పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్‌లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ సంపత్ కుమార్, ఎస్‌ఈపీ కో ఆర్డినేటర్ డా.వాసం చంద్రశేఖర్, పాల్గొన్నారు.


AJ CLASSIFIEDS

**పాస్‌పోర్ట్ పోయినది**

ఆర్మూర్ నుండి మిర్దపల్లికి 15-3-2025 రోజున బైక్‌పై వెళ్తుండగా దారి మధ్యలో నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎక్కడో పడిపోయినది. పేరు: MARAMPALLY MAHIPAL REDDY, పాస్‌పోర్ట్ నెం. G6792114 గలది. ఎవరికైన దొరికితే సం. 9848372052

AJZ

**ఇల్లు అమ్మబడును**

ధర్మారం (బి) గ్రామంలోని SC కాలనీలో (2BHK) డబుల్ బెడ్‌రూమ్, హాల్, కిచెన్, కంపౌండ్‌వాల్ గల ఇల్లు అమ్మకమునకు కలదు. ఆసక్తిగల వారు సంప్రదించగలరు. సెల్: 8309063554

AJZ

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

AJ Classifieds ఆంధ్రజ్యోతి
మీ అభిమాన దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్
ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra




-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453


డా. టి.రామస్వామి, అడ్వకేట్, మద్రాస్ ఉన్నత న్యాయస్థానం, సోల్ ఆర్బిట్రేటర్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ సమక్షంలో
(Arb.OP (Comm.Div) No.407 of 2024, మద్రాస్ ఉన్నత న్యాయస్థానంలో లేవనెత్తుట)

Same Deutz Fahr ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్నది శ్రీ పి.రమేష్, నం. 72/72M/73-77, SIPCOT ఇండస్ట్రియల్ కాంప్లెక్స్, రాణీపేట-632 403, తమిళనాడు ......క్లెయిందారు

Vs

1. M/s అక్షయ ట్రాక్టర్స్, భాగస్వామ్య సంస్థ, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని భాగస్వాములు కూరగాయల గణేష్ మరియు కూరగాయల స్వప్న.
2. శ్రీ కూరగాయల గణేష్, భాగస్వామి M/s అక్షయ ట్రాక్టర్స్.
3. శ్రీమతి కూరగాయల స్వప్న, భాగస్వామి M/s అక్షయ ట్రాక్టర్స్.

వీరందరి కార్యాలయం: 4-105/I/A, అమృత గార్డెన్ ఎదురుగా, హైదరాబాద్ రోడ్, గ్రామం బర్ధీపూర్, మండలం డిచ్పల్లి, జిల్లా నిజామాబాద్, తెలంగాణ-503230 మరియు ఇం.నం. 4-7-17, ఇసబ్ గల్లి, నిజామాబాద్, తెలంగాణ-503003 ...ప్రతివాదులు.

ఆర్బిట్రేషన్‌లో తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు తేది:29.03.2025న సమయం ఉదయం 11.00 గంటలకు Ld. సోల్ ఆర్బిట్రేటర్ డా.టి.రామస్వామి అడ్వకేట్ ద్వారా పైన తెలిపిన ఆర్బిట్రల్ ప్రొసీడింగ్స్ తీసుకొనబడినవి. Ld. ట్రిబ్యునల్ పరిశీలన కొరకు క్లెయిందారు ద్వారా దాఖలు చేయబడిన రెండు దరఖాస్తులు స్వీకరించబడినవి. అవి ది గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నిజామాబాద్ శాఖ, HDFC బ్యాంక్ నిజామాబాద్ శాఖ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇంతకుముందు కార్పొరేషన్ బ్యాంక్), నిజామాబాద్ శాఖలతో నిర్వహించబడుతున్న వారి బ్యాంక్ ఖాతాల నుండి లావాదేవీలు జరుపుటకు ప్రతివాదులను నిరోధిస్తూ గార్నిషీ ఉత్తర్వు కోరుతూ I.A. No.2 of 2025 లో దరఖాస్తు మరియు మరొకటి క్లెయిందారు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఉపయోగించుట నుండి ప్రతివాదులను నిరోధిస్తూ శాశ్వత నిషేధపుటుత్తర్వు కోరుతూ I.A. నం. 3 ఆఫ్ 2025 లో దరఖాస్తు. అయితే, అవి Ld. ట్రిబ్యునల్ సమక్షంలో హాజరగుట లో ప్రతివాదులు విఫలమైనందున, శీర్షిక యందు విషయం ప్రకారం ప్రతివాదులపై పత్రికా ప్రచురణ ద్వారా నోటీసు అందజేయుట కొరకు Ld. ట్రిబ్యునల్ ద్వారా వాయిదా వేయబడినవి. ప్రతివాదులు హాజరు కొరకు మరియు తదుపరి ప్రొసీడింగ్స్ కొరకు Ld. ఆర్బిట్రేటర్ ద్వారా ఆర్బిట్రేటర్ కార్యాలయం, వడివాలయం, ఓల్డ్ నం.27 ( న్యూ నం.16), లోగనాథన్ నగర్, II స్ట్రీట్, చూలైమేడు, చెన్నై-600 094 వద్ద 29.04.2025న సా.4.00 గం.లకు తదుపరి విచారణ తేదీ షెడ్యూల్ చేయబడినది. విచారణ స్వయంగా హాజరు విధానంలో చేయబడును. ఇందువలన, drlawful@gmail.comor communication కు ఇమెయిల్ చేయుట ద్వారా డా.టి.రామస్వామి, అడ్వకేట్, వడివాలయం, ఓల్డ్ నం. 27(న్యూ నం. 16), లోగనాథన్ నగర్, II స్ట్రీట్, (100 అడుగుల రోడ్‌పై ఎంఎండిఏ బస్ స్టాప్ మరియు అరంబాక్కం మెట్రో రైల్వే స్టేషన్ సమీపాన) చూలైమేడు, చెన్నై-600 094, ఫోన్ : 9444012425 వద్ద 29.04.2025న ఆర్బిట్రల్ ప్రొసీడింగ్స్‌లో పాల్గొనుటకు Ld. ఆర్బిట్రేటర్‌ను సంప్రదించవలసిందిగా ప్రతివాదులు ఆదేశించబడుతున్నారు. స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా నివేదిస్తూ గానీ 29.04.2025న సా. 04.00 గం.కు ఆర్బిట్రల్ ప్రొసీడింగ్స్‌లో స్వయంగా హాజరు కావలసిందిగా ప్రతివాది నం. 1, 2 మరియు 3 కోరబడుతున్నారు, లేనిచో మీ పరోక్షంలో సదరు విషయం విచారించబడుతుంది.

సురానా & సురానా తరఫున

SHRIRAM Finance

**రిజిస్టర్డ్ ఆఫీస్:** శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
**నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మున్సోలి,నవీ ముంబై-400710.

**గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు**

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

**వేలం తేది: 19-04-2025,** వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 1-4-683, 1 వ అంతస్తు,అంబేద్కర్ చౌరస్తా,బోధన్-503185

| Loan A/C No | Customer Name | Loan A/C No | Customer Name |
|---|---|---|---|
| BODHNPJ2407180021 | ASIFA BEGUM SHAIK SHAIK | BODHNPJ2410280002 | JAMEEL AHMED KHAN |
| BODHNPJ2410190006 | SAVITHRI KUMMARI | BODHNPJ2410280014 | MOHAMMED ALTHAF |
| BODHNPJ2410230012 | BEGARI SURESH | BODHNPJ2410280007 | RAMAKRISHNA T |
| BODHNPJ2410270001 | ERRELLY BABU | BODHNPJ2410290001 | BALAPURAM RAVI |

**వేలం తేది: 19-04-2025,** వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 5-2-187, 1 వ అంతస్తు,ఎన్.హెచ్ 44 రోడ్,కామారెడ్డి,కామారెడి జిల్లా-503111

| Loan A/C No | Customer Name | Loan A/C No | Customer Name |
|---|---|---|---|
| KMRD2PJ2410090010 | GOPALAKRISHNA EKAMBA NANDINI | KMRD2PJ2410190002 | GUMASTHA NAGAMANI |

**వేలం తేది: 19-04-2025,** వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 7-8-127, 1 వ అంతస్తు, దేవి మాత గుడి ప్రక్కన, దేవి రోడ్, నిజామాబాద్ -503001

| Loan A/C No | Customer Name | Loan A/C No | Customer Name |
|---|---|---|---|
| NIZA2PJ2410090008 | B PRIYANKA | NIZBRPJ2410170003 | JELLA SHIVARAJ |
| NIZA2PJ2410140003 | BOINI SHEKHAR | NIZBRPJ2410210001 | PATLOLA LAVANYA |
| NIZA2PJ2410230006 | SIRRAVINOD KUMAR | NIZBRPJ2406060001 | MANDA HANUMANDAS |
| NIZA2PJ2410290001 | NAZEERABEGUM | | |
| NIZA2PJ2410300006 | ANTADUPULA SHIVARANJANI | | |

**వేలం సమయం: 11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడుశ్రీ **యం.అశోక్ కుమార్** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

**తేది: 11.04.2025**
స్థలం: నిజామాబాద్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

## బాన్సువాడలో తేలికపాటి వర్షం

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో గురువారం తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం కలిగించింది. కానీ రైతులు తమ పంటలు కోసే సమయంలో అకాలవర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

**బీర్కూర్ :** మండలంలో గురువారం మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో, రహదారుల పక్కన, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది.

## మెగా జాబ్‌మేళా

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): న్యూలాండ్ లాబోరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద జూనియర్ కళాశాలలో ఈ జాబ్‌మేళాలుంటాయని తెలిపారు. వివరాలకు 9490 800213, 8099019595, 630204295లకు సంప్రదించాలని తెలిపారు.

## ఆదివాసీ శిక్షణా శిబిరానికి రాణాప్రతాప్ ఎంపిక

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాయపూర్ ఆదివాసి శిక్షణ శిబిరానికి ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ రాణాప్రతాప్‌రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్‌రాథోడ్ ఎంపికయ్యారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివాసి కాంగ్రెస్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. తమ పట్ల విశ్వాసంతో ఎంపిక చేసినందుకు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, రాష్ట్రట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వడ్లంలో కొనసాగుతున్న అఖండ హరినామా సప్తాహ



హరినామ స్మరణ చేస్తున్న భక్తులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం గ్రామంలో ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం గురువారం ఆరోరోజుకు చేరుకుంది. కాస్లాబాద్ గ్రామానికి చెందిన ప్రముఖ కీర్తనకార్ విఠల్ మహరాజ్ ఆధ్వర్యంలో ఐదురోజుల క్రితం గ్రామంలో సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. రోజు వారి కార్యక్రమాలతో పాటు రాత్రి వివిధ గ్రామాలకు చెందిన కీర్తన మహరాజ్‌లో శ్రీకృష్ణుడి లీలలను వివరిస్తున్నారు. ఏడో రోజున గాథ పూజ నిర్వహించిన అనంతరం చివరిరోజు కాలకీర్తనతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఆరురోజుల నుంచి గ్రామంలో అఖండ హరినామ సప్తాహ జరుగుతుండడంతో గ్రామం హరినామస్మరణతో మారుమోగుతుంది. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



ధృవపత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 161వ జాతీయ రహదారి గుండా ప్రయాణం చేసే వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాలు నడపాలని పెద్దకొడప్‌గల్ ఎస్‌ఐ మహేందర్ సూచించారు. గురువారం సాయంత్రం సిబ్బందితో కలిసి అంజనీగేట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనదారులు వాహనం నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు, తమకు కేటాయించిన లైన్‌లోనే ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి పర్వదినం ఉండడంతో శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో హనుమాన్ ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. జయంతికి ముందు రోజు ప్రతిసారి మాదిరిగానే ఆయా గ్రామాలలో హనుమాన్ భక్తులతో పాటు, ఆలయ కమిటీ వారు ఆలయాలకు కొత్తగా రంగులు వేయిస్తారు. ఆలయాన్ని శుభ్రం చేయడంతో పాటు జయంతి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం, కార్యక్రమం అనంతరం అన్నదానానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఏ గ్రామంలో చూసినా హనుమాన్ ఆలయాలు సుందరంగా కనిపిస్తున్నాయి.

## 'గావ్‌చలో-బస్తీచలో కార్యక్రమాన్ని నిర్వహించాలి'

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గావ్‌చలో-బస్తీ చలో అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 11,12,13 తేదీలలో గ్రామాలు, పట్టణాలలో నిర్వహించాలని కార్యక్రమ జిల్లా ప్రభారి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాల్లోని అన్ని వార్డులలో సమావేశాలు ఏర్పాటు చేసి సిద్ధాంతాలను, సాధించిన విజయాలను, భవిష్యత్తు లక్ష్యాలను పార్టీ కార్యకర్తలకు వివరించి, తెలంగాణలో రాబోయే రోజుల్లో అధికారం దిశగా పోవడానికి కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్రకార్యవర్గసభ్యులు బాణాలలక్ష్మారెడ్డి, నాయకులు వేణు, వెంకట్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## 'కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు'




నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

భిక్కనూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని భిక్కనూర్ సౌత్‌క్యాంపస్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బీటీఎస్ చౌరస్తాలో ఉన్న సౌత్‌క్యాంపస్‌లో బంద్ ప్రకటించి నిరసన తెలిపారు. తమను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరించి ఆదుకుంటామని తెలిపి ఇప్పుడు బలవంతపు అరెస్టులు చేయించి, గృహనిర్బంధం చేయడం, మహిళ అధ్యాపకుల పట్ల దురుసుగా ప్రవర్తించడం బాధ కలిగించదన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు నారా యణ, హాస్టల్ వార్డెన్స్ యాలాద్రి, సునీత, రమాదేవి, నర్సయ్య, అసిస్టెంట్ పీఆర్ సరిత, నిరంజన్, శ్రీకాంత్, దీలిప్, పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యాపకులు ఇంద్రకరణ్‌రెడ్డి, పోతన్న, శ్రీకాంత్, కనకయ్య పాల్గొన్నారు.

## రాజంపేటలో గర్భిణులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు మెడికల్ ఆఫీసర్ విజయమహాలక్ష్మీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

# కుంటలో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి



బాలుర మృతదేహాలు

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి ఇద్దరు బాలురు మృతిచెందారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన తేజావత్ సాయికుమార్ (16), భూక్యసురేష్ (14) అనే ఇద్దరు బాలుర రాఘుపూర్ వద్ద గల ఓ కుంటలో ఈతకొట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి మృతిచెందినట్లు దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈనెల 8న సాయికుమార్, సురేష్‌లు ఇంట్లోంచి బయటకు వెళ్లి రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. వారి ఇరువురి కోసం కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. రాఘవపూర్ శివారులోని నర్సారెడ్డి కుంటలో రెండు మృతదేహాలు నీటిలో పైకి తేలిఉండడంతో స్థానికులు గుర్తించి, పోలీసులతో పాటు మృతుల కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు, కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకోగా కుంట వద్ద ఇద్దరి బాలుర దుస్తులున్నాయి. ఇరువురు కుంట వద్దకు ఈతకొట్టేందుకు వెళ్లగా వారికి ఈతరాకపోవడంతో నీటిలో మునిగిపోయారని ఎస్‌ఐ తెలిపారు. సాయికుమార్, సురేష్‌ల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి నిరసన



శ్రీనివాస్‌రావుకు నచ్చచెబుతున్న పోలీసులు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్‌రావు తనకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చొక్కా విప్పి బైఠాయించి నిరసన తెలిపాడు. పోచారం గ్రామంలో రెండు ఎకరాల పట్టా భూమి తన తండ్రి పేరిట ఉండగా తల్లిదండ్రులు మృతిచెందడంతో వారసత్వంగా తనకు రావాల్సిన భూమిని తనకు ఇవ్వకుండా తన అన్న బాపురావు తన పేరిట భూమిని పట్టా చేసుకున్నాడని శ్రీనివాస్‌రావు ఆరోపించాడు. కొంతకాలంగా తాను బతుకు తెరువు కోసం హైదరాబాద్ వెళ్లానని, తనకు వారసత్వంగా రావాల్సిన భూమిని తన అన్న తనకు ఇవ్వకుండా, తనకు తెలియకుండానే తన పేరిట పట్టా చేసుకొని తనకు అన్యాయం చేశాడని అధికారులు తనకు న్యాయం చేయాలని ఆయన కోరాడు. యువకుడి నిరసన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడికి నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌రావును విలేకరులు వివరణ కోరగా శ్రీనివాస్ రావు అన్నదమ్ముల కుటుంబ వ్యవహారం అని, సివిల్ కోర్టులో సమస్యను పరిష్కరిం చుకోవాలని ఆయన తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



మద్నూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



బంజారా తండాలో...

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు అని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, అన్నాసాగర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మా రెడ్డి రజిత రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కాసాల శ్రీనివాస్ రెడ్డి, వెల్లుట్ల సొసైటీ చైర్మన్ పటేల్ సాయిలు, సహకార సంఘం డైరెక్టర్లు, మాజీసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, ఏఈఓ రాజా గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**మద్నూర్ :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పరమేష్ పటేల్ అన్నారు. గురువారం డోంగ్లీ మండలం మోగ గ్రామంలో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండోచైర్మన్ రామ్‌పటేల్, మండల వ్యవసాయ అధికారి శివ, ఏఈఓ విశాల్, మాజీ ఎంపీటీసీ హనుమంతరావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ :** రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని బీబీపేట విండో వైస్ చైర్మన్ రంగోలి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని అంబార్‌పేట గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిరంగి అశోక్, నర్సింలు, ఈశ్వర్‌గౌడ్, రాజాం, రాజయ్య, జనార్దన్‌రెడ్డి, శేఖర్, వినీత్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

**తిప్పాపూర్‌లో..**

భిక్కనూర్ మండలంలోని తిప్పాపూర్, మోటాట్‌పల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు,విండో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రాజు అన్నారు. గురువారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీసీ ప్రవీణ్, ఎఫ్ఏ కే.అంజాగౌడ్, సీఏ పెద్దమడ్డల రాజు, మహిళా సంఘం సభ్యురాలు పద్మ, రైతు హన్మంతరావు, పాల్గొన్నారు.



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

**రాజంపేట:** మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు 2320,బీగ్రేడ్‌కు 2300ల ధర రైతులకు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, డైరెక్టర్‌లు బాలయ్య, బస్వయ్య, సాయిబాబా, శ్రీరాం, సురేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డిటౌన్ :** జిల్లాలోని 16 కేంద్రాలలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లామేనేజర్ మహేష్‌కుమార్ తెలిపారు. 70 వేల ఎకరాలలో జొన్న పంటను రైతులు పండించారని తెలిపారు. రూ.3371 క్వింటాల్‌కు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు.

## కౌలాస్‌కోట భూములపై విచారణ

జుక్కల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం కౌలాస్ కోట భూములపై గురువారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి విచారణ జరిపారు. కౌలాస్‌కోట పూర్వికులు కౌలాస్ గ్రామానికి చెందిన రాజులు భూమి తమ ఆధీనంలో ఉందంటూ గతంలో వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా కౌలాస్‌కోటకు పరిసరాల ప్రాంతాలలో అటవీ భూములు విస్తీర్ణం ఎంతవరకు ఉందని ఫారెస్టు అధికారులతో విచారణ జరిపారు. అదేవిధంగా ధరణి స్లాట్ బుకింగ్ పెండింగ్ ఫిర్యాదులను పరిశీలించారు. కౌలాస్ కోట భూమి విస్తీర్ణం అడవుల భూమి విస్తీర్ణం పరిశీలించి విచారణ చేశామని ఆమె అన్నారు. కోట పూర్వీకుల భూమి విస్తీర్ణం ఎంత ఉంది అనేది పరిశీలించి త్వరలో తెలుపుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామారావు అటవీ అధికారులు పాల్గొన్నారు.



కౌలాస్‌కోటను సందర్శించిన బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి

## మెడికల్ కళాశాలలో జరిగిన అక్రమ నియామకాలు రద్దుచేయాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మెడికల్ కళాశాలలో జరిగిన అక్రమ నియామకాలను రద్దుచేయాల్సిందేనని విద్యార్థి సంఘనాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వలేదని, రూల్‌ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని అన్నారు. విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో కొన్నిరోజుల నుంచి నిరసనలు తెలుపుతున్నా, కలెక్టర్‌కు వినతులు ఇస్తున్నా అక్రమ నియామకాలపై అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలని అన్నారు. నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలుచేసి ఉద్యోగాలు ఇచ్చారని బలమైన కారణాలు ఉన్నప్పటికీ అభ్యర్థులకు విన్నవిం చినప్పటికీ కలెక్టర్ స్పందించకపోవడం సరైంది కాదన్నారు. కామారెడ్డి మ్యాన్‌పవర్ ఏజెన్సీ, వారి సంబంధికుల, ప్రిన్సిపల్ శివప్రసాద్, ఎంప్లా యిమెంట్ ఆఫీస్ సిబ్బంది లావాదేవీలు పరిశీలించాలన్నారు. ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్లను ప్రత్యేక కమిటీ వేసి బహిరంగంగా పరిశీలన చేపట్టాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీవీయం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్, పీడీ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, బీసీ విద్యార్థిసంఘం జిల్లా అధ్య క్షుడు నాగరాజు, జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, నిరు ద్యోగులు రవి, గణేష్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్

బాన్సువాడటౌన్ , ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి ) : పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ కార్యాలయం ఎదుట గురువారం ప్రచారరథంతో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్బీఐ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటపుడు జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లపై క్లిక్ చేయరాదని, మెసేజ్‌లు చూడవద్దన్నారు. ఓటీపీలు , పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. బ్యాంక్ అధికారులు ఎపుడు కూడా ఫోన్ ద్వారా ఓటీపీ సమాచారం అడగరని , అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల బాధితులు వెంటనే సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులున్నారు.

## 17 నుంచి భేతాళస్వామి జాతర



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామపెద్దలు

బాన్సువాడటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలో ఈ నెల 17 నుంచి 19 వరకు భేతాళస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 17న ఉదయం జాతర ప్రారంభం, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, 18న కుస్తీ పోటీలు , 19న జాతర ముగింపు ఉంటుందని వారు తెలిపారు. సమావేశంలో కమిషనర్ శ్రీహరిరాజు , జంగం గంగాధర్ , ఎర్వల కృష్ణారెడ్డి , మాసాని శ్రీనివాస్‌రెడ్డి , కొర్ల పోతురెడ్డి, నార్ల రవీందర్ , మాసాని రవీందర్‌రెడ్డి, మాసాని రాంరెడ్డిలున్నారు.

## కొలతల ప్రకారమే డబ్బులు చెల్లిస్తాం



కూలీలలో మాట్లాడుతున్న ఎంపీడీవో

దోమకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పథకంలో కూలీలు చేసిన కొలతల ప్రకారం డబ్బులు వారి ఖాతాలతో జమ చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలోని పెద్దచెరువులో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పాంఫాండ్ పనులను పరిశీలించారు. ఎంత మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 184 మంది పనులకు హాజవుతున్నారని ఎఫ్ఏ తెలిపారు. పనిప్రదేశంలో మస్టర్‌లలో కూలీల హాజరును ఎంపీడీవో స్వయంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే ప్రభుత్వం నిర్ణయించిన కూలీ రూ.307 చెల్లిస్తామనిని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రజని, సీఏ పెద్దమడ్డల రాజు, సహాయకులు శేఖర్, కూలీలు పాల్గొన్నారు.

## భిక్కనూర్‌లో కొనసాగుతున్న పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

భిక్కనూర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వనదుర్గ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని డప్పు చప్పుల్ల నడుమ ప్రధానవీధుల గుండా ముదిరాజ్ సంఘం సభ్యులు ఊరేగించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జాతీయ సేవా కార్యక్రమం




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం జాతీయ సేవా పథకం కింద చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం నాల్గోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దోమకొండలోని మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయలం, గడికోట ముందు, ఉపగడ్డ, పాతబస్టాండ్‌ల వద్ద శ్రమదానం చేసి చెత్తను తీసివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడురోజుల పాటు జరిగే జాతీయ సేవా కార్యక్రమం దోమకొండలో మరో మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, దోమకొండ గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జి, గణేష్ యాదవ్, బీటీఎస్ సౌత్ క్యాంపస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తుగా ఇంటిపన్ను చెల్లింపు



కమిషనర్‌కు ఇంటిపన్ను డబ్బులను అందిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, ఏప్రిల్ 10: ప్రజలు ముందస్తు ఇంటిపన్ను చెల్లించి 5 శాతం రిబేట్ పొందాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ తెలిపారు. గురువారం 45వ వార్డుకు చెందిన కోపూరు భూమేష్ ఇంటిపన్ను రూ.3 లక్షల 56 వేలు, కోపూరు నరేందర్ రూ.50 వేలు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ముందస్తు పన్ను చెల్లించి 5 శాతం రిబేట్ పొందేందుకు ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు ఇచ్చిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్లవేణు, నాయకుడు గెరిగంటి లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఆర్వో గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| దర్శన్ | - రాబిన్ హుడ్ |
| ప్రియా 70 | - స్టేట్ వర్సెస్ నోబడి |
| ప్రియా 35 | - శారీ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | - జాక్ |
| వెంకటేశ్వర | - గుడ్‌బ్యాడ్‌అగ్లీ |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 120 | 140 | 170 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

